


పోస్టింగ్‌లకు.. పోటీ

బదిలీల నిషేధ గడువు సమీపిస్తోంది. బదిలీలకు సమయం దగ్గరకు వచ్చేసింది. అనుకూలమైన పోస్టింగ్ కోసం ఉద్యోగుల నుంచి అధికారుల వరకు పోటీపడుతున్నారు. ఎవరిస్థాయిలో వారు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. ఒక్కో పోస్టు కోసం రెండు నుంచి ఐదు వరకు సిఫార్సులు వచ్చాయి. ఇవే కాకుండా ఇంకా కొందరు ఉద్యోగులు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దసంఖ్యలో సిఫార్సు లేఖలు రావడంతో ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలనే అంశంలో ఉన్నతాధి కారుల్లో గందరగోళం నెలకొన్నట్లు సమాచారం. వైసీపీతో అంటకాగిన వారు కూడా సిఫార్సులతో సిద్ధమైనట్లు సమా చారం. దాదాపు బదిలీల దరఖాస్తులు సదరు ఉన్నతాధికారులకు, మంత్రుల పేషీ లకు చేరగా వీటిపై కసరత్తు ప్రారంభ మైనట్లు సమాచారం. బదిలీలపై ఉద్యోగు ల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎవరి సిఫార్సు లేఖలు పనిచేస్తాయో.. ఎవరివి బుట్టదాఖలు అవుతాయో ఈ నెల 31వ తేదీతో తేలుతుంది.



- బదిలీల కోసం భారీగా సిఫార్సులు
- ఒక్కో పోస్టుకు రెండు నుంచి ఐదు వరకు..
- ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలని హెచ్‌వోడీల ఆరా
- బదిలీ కోరుతూ 70 నుంచి 90 శాతం దరఖాస్తులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

● ఓ మున్సిపాల్టీలో డీఈ పోస్టు కోసం ఐదుగురు లేఖలతో సిద్ధమయ్యారు. ఈ ఐదుగురులో ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఏ నేత సిఫార్సుకు ఆమోదం తెలిపితే ఏమవుతుందోననే ఆందోళనలో హెచ్‌వోడీలు ఉన్నాయి.

● మరికొన్ని నియోజకవర్గాల్లో కొన్నిపోస్టులకు రెండు నుంచి మూడు లేఖలు జారీ అయ్యాయి. ఓ నియోజకవర్గంలో సిఫార్సు లేఖల జారీ గందరగోళానికి దారి తీసినట్లు తెలిసింది.

● ఓ అధికారి పోస్టింగ్ విషయంలో పార్టీ నేతలు వి వాదానికి కూడా దిగినట్లు సమాచారం. వైసీపీతో అంట కాగిన అధికారికి సిఫార్సు లేఖ జారీ చేయడం వల్లే ఈ వివాదం జరిగినట్లు తెలిసింది.

● కొన్ని చోట్ల ద్వితీయ శ్రేణి నేతలు బేరసారాలు చేసుకుని ఎమ్మెల్యేలను మధ్యపెట్టి సిఫార్సు లేఖలు జారీ చేయించినట్లు సమాచారం. ఈ కారణంగానే ఒక్కో పోస్టుకు ఎక్కువగా సిఫార్సు లేఖలు జారీ అయినట్లు సమాచారం.

ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో బదిలీలపై నిషేధం సడలించిన తర్వాత జరుగుతున్న ప్రహసనం. కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన రెండు నెలల తర్వాత బదిలీలకు ఆమోదం తెలపగా ఈ నెల 31వ తేదీని గడువుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఐదేళ్ల ఒకే చోట సర్వీసు పూర్తి చేసిన వారికి బదిలీ తప్పనిసరి చేసింది. రిక్వెస్ట్ విధానంలో బదిలీలకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో అధికారులు, ఉద్యోగులు వారికి నచ్చిన చోట పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే సిఫార్సు లేఖ తప్పని సరి చేశారు. ఈ క్రమంలో పెద్దఎత్తున సిఫార్సు లేఖలు తెచ్చుకుని బదిలీ దరఖాస్తుతో ఆయా శాఖల హెచ్‌వోడీలకు అందజేసినట్లు సమాచారం. ఇలా దరఖాస్తు చేసిన ఉద్యోగులకు సంబంధించి ఈ నెల 31న బదిలీల జాబితా విడుదల అవుతుందని అధికారులు తెలిపారు. 70 నుంచి 90 శాతం వరకు బదిలీలు కోరుతూ లేఖలను ఆయా శాఖల హెచ్‌వోడీలకు పంపారు. రెండు రోజుల్లో లేఖల ప్రక్రియ ముగుస్తుందంటున్నారు. బదిలీలకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లాలో లెక్కకు మించి సిఫార్సు లేఖలు జారీ అయ్యాయి. ఒక్కో పోస్టుకు రెండు నుంచి ఐదు వరకు కూడా సిఫార్సు లేఖలు రావడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. ఒక పోస్టుకు ఒకటికి మించి సిఫార్సు లేఖలు అందడంతో ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలో తెలియని పరిస్థితి ఆయా శాఖ హెచ్‌వోడీల్లో నెలకొన్నట్లు చెబుతున్నారు. బదిలీల దరఖాస్తులు సదరు ఉన్నతా ధికారులకు, మంత్రుల పేషీలకు చేరాయి. వీటిపై కసరత్తు ప్రారంభమైంది. కొన్ని చోట్ల ఒక పోస్టుకు ఒకటి కంటే ఎక్కువగా సిఫార్సు లేఖలు జారీ కావడంతో పోస్టింగ్‌ల విషయంలో ఉన్నతా.ధికారులు కొంత మేర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రచారం. సిఫార్సు లేఖలు ఇప్పించడంతో పోటీ పడిన ద్వితీయ శ్రేణి నేతలు వారు రికమండ్ చేసిన వారికి పోస్టింగ్‌లు దక్కుతాయా లేదా అన్న సంశయంలో ఉన్నారు.

ఇంకా పైరవీ ప్రయత్నాల్లో పలువురు

ఇప్పటికే ఒక్కో పోస్టుకు పెద్దసంఖ్యలో సిఫార్సు లేఖలు రావడం.. ఎవరికి, ఏ లేఖకు ప్రాధాన్యం ఇవ్వాలో తెలియని గందరగోళ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ క్రమంలో ఇంకా కొందరు పోస్టింగ్‌ల కోసం పైరవీల ప్రయత్నాలు చేస్తున్నారు. ద్వితీయ శ్రేణి నేతలను ఆశ్రయించి వారి ద్వారా పోస్టింగ్‌ల కోసం పావులు కదుపుతున్నట్లు సమాచారం. అయితే ఒకే పోస్టింగ్‌కు ఒకటి కంటే ఎక్కువగా సిఫార్సు లేఖలు జారీతో లేఖలు ఇప్పించిన నేతలకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. మున్సిపల్ శాఖలో డిప్యూటేషన్‌పై ఇతర శాఖల అధికారులు పనిచేస్తున్నారు. వీరికి తిరిగి పోస్టింగ్‌ల కోసం కొందరు నేతలు ప్రయత్నిస్తున్నారు. విద్యా, ఆడిట్ వంటి శాఖల్లో పనిచేసిన వారిని మున్సిపల్ అధికారులుగా తీసుకురావడానికి యత్ని స్తున్నారు. అయితే డిప్యూ టేషన్లను ప్రభుత్వం అంగీకరించడంలేదని చెబుతున్నారు.

వైసీపీ అధికారులకూ సిఫార్సులు..

గత ఐదేళ్లు వైసీపీ పాలనలో ఆ నేతలతో అంటకాగిన అధికారుల్లో కొందరికి కోరుకున్న చోట పోస్టింగ్‌లు దక్కే విధంగా కూటమి నేతల ద్వారా సిఫార్సు లేఖలు జారీ అయ్యాయన్న విమర్శలు న్నాయి. వైసీపీ నేతలకు సహాయ సహకారాలు అందించి, అక్ర మాలకు ఊతం ఇచ్చిన కొందరు అధికారులు బడా కాం ట్రాక్టర్ల ద్వారా సిఫార్సు చేయించుకుంటున్నట్లు ప్రచారం జరు గుతుంది. దీనిని టీడీపీ నేతలు గట్టిగా వ్యతిరేకిస్తున్నారు.



నాడు కక్ష కట్టి.. నేడు కదలరంట

- కీలక స్థానాల్లో కొనసాగేందుకు అధికారుల పావులు
- వైసీపీ నేతల సిఫార్సుతో వచ్చి వేధించిన ఇంజనీరింగ్ యంత్రాంగం
- టీడీపీ నేతల పనులకు 29 శాతం రికవరీ రాసిన ఘనులు
- రూ.5 లక్ష పనికి సున్నా చెల్లింపునకు ప్రతిపాదించిందీ వారే

గుంటూరు సిటీ :

● సత్తెనపల్లి మండలంలో టీడీపీ మద్దతుదారుడైన ఓ సర్పంచ్ రూ.5 లక్షలు ఖర్చు పెట్టి రోడ్డు వేశారు. ఆ పనిని తనిఖీ చేసిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు సదరు సర్పంచ్‌కి సున్నా శాతం నిధులు విడుదల చేయాలని సూచించారు.

● 2014- 2019 మధ్య జరిగిన పనులకు విడుదల చేసిన నిధుల్లో 29 శాతం తిరిగి చెల్లించాలని కొందరు అధికారులు వైసీపీ హయాంలో రికవరీ రాశారు.

● స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులతో చేపట్టిన 150 పనులను తిరస్కరించి టీడీపీ నేతలు రూ.కోట్లు నష్ట పోయేలా చేశారు.

ఇందుకు కారణం ఏమిటి అంటే ఆ పనుల్లో నాణ్యతా లోపాలు కాదు. ఆ పనులు చేసింది టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు కావడమే. ఇలా టీడీపీ పేరు వింటే వైసీపీ పాలనలో కస్సు బుస్సులాడిన అధికారులు ఇప్పుడు కూడా అదే పోస్టుల్లో ఉండేందుకు పావులు కదుపుతున్నారు. యూనియన్లు, అసోసియేషన్లు అంటూ అడ్డదారిలో కీలక పోస్టుల నుంచి కదలకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతల ఇంజ నీరింగ్ విభా గాల్లోకి వచ్చి తెలుగుదేశం పార్టీ నేతలు, వారి మద్దతుదారులన్నా కక్ష కట్టారు. వారు చేసిన పనులకు కొర్రీలు వేసి మరీ నష్ట పోయేలా చేశారు. ఇలాంటి అధికారులే కూటమి ప్రభుత్వంలోనూ ఆ స్థానాల నుంచి కదలకుండా ఉండేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

అంతా వాళ్లే..

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన క్వాలిటీ కంట్రోల్, ఎష్యూరెన్స్‌లో ఎక్కువ మంది వైసీపీ అనుకూల అధికారులు ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మాజీ మంత్రి భర్త స్నేహితుడు ఇక్కడ కీలక పోస్టులో కొనసాగుతున్నారు. అప్పట్లో సదరు మంత్రి చలవ తోనే ఈ పోస్టు ఆయనకు దక్కింది. ఆ తర్వాత జిల్లా పరిషత్‌లోని బదిలీలు, పోస్టింగ్‌లు అన్నీ ఆయన కనుసన్నల్లోనే జరిగినట్లు తెలుస్తోంది. ఈ అధికారి నేతృత్వంలోనే టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు చేసిన పనులన్నింటికి నిధులు రాకుండా కొర్రీలు వేశారు. రూ.5 లక్షలతో వేసిన రోడ్డుకు కనీసం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదంటే ఏ స్థాయిలో కక్ష సాధింపు జరిగిందో అర్థం అవుతుంది. ఇక్కడే పనిచేస్తున్న మరో అధికారి అప్పటి రాజ్యసభ సభ్యుడుకి క్లాస్‌మేట్. ఆయన కూడా వేధింపులకు పాల్పడ్డారు. కింద స్థాయి ఇంజనీర్లను కూడా ఈ అధికారులు పార్టీ పేరుతో వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఈ అధికారులు ఐదేళ్లు పూర్తి కావడంతో బదిలీ జర గాల్సి ఉంది. అయినా వెళ్లేందుకు ఇష్టంలేక అసోసియేషన్‌లో పదవు లు ఉన్నట్లుగా చూపించి మళ్లీ అక్కడే కొనసాగేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆయా అసోసియేషన్ల నాయకులను కాకా పడుతున్నారు.

మళ్లీ వాళ్లే ఉంటే గుల్లే...

చేసిన పనులకు చిల్లి గవ్వ రాకుండా అడ్డుపడిన అధికారులు క్వాలిటీ కంట్రోల్ విభాగంలో కొనసాగడానికి వీలు లేదని టీడీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు. ఇప్పుడు వాళ్లు అక్కడ ఉంటే ఏ పని ముందుకు సాగనివ్వరంటున్నారు. టీడీపీ నేతలను ఇబ్బందులు పెట్టిన వాళ్లను అక్కడ ఉంచటం దుర్మార్గం అని అంటున్నారు. వాళ్ళ వల్ల టీడీపీకి చెందిన చాలామంది బిల్లులు రాక ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు.



సిఫార్సులతో ఉమ్మడి గుంటూరు జిల్లా లోని పలు



● చికిత్స పొందుతున్న విద్యార్థులు

విద్యాలయంలో.. విషవాయువులు

- సైన్స్ ప్రయోగంలో అపశృతి..
- విద్యార్థులకు అస్వస్థత
- సూర్యలంక కేంద్రీయ విద్యాలయంలో ఘటన.. సీఎంవో అధికారుల ఆరా
- సత్వరం స్పందించిన అధికారులు..
- నిలకడగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి

బాపట్ల, ఆగస్టు 24: సైన్సు ప్రయోగం.. కొందరు విద్యార్థుల ఆకతాయితనం.. విషవాయువులు వెలువడి 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన బాపట్ల మండలం సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం చోటుచేసుకుంది. విద్యాలయంలో ఉదయం ఆరో తరగతి విద్యార్థులకు సైన్స్ క్లాస్‌లో భాగంగా రసాయన ప్రయోగాలను ప్రాక్టికల్స్ ద్వారా విద్యార్థులకు ఉపాధ్యాయురాలు వివరించారు. టీచర్ బయటకు వెళ్లగా అక్కడ ఉన్న రసాయనాలకు ఓ విద్యార్థి తనదగ్గర ఉన్న ఉప్పు, శానిటైజర్‌కు తోడు కాఫీపొడి మిక్స్ చేశాడు. దీంతో ఒక్కసారిగా విషవాయువులు తరగతి గది అంతా పొగలా వ్యాపించాయి. ఇవి పక్క గదిలోని ఏడో తరగతి విద్యార్థులను కూడా తాకడంతో అస్వస్థతకు గురయ్యారు. కొంతమంది విద్యార్థులు టిష్యూ పేపర్‌పై ఆ రసాయనాన్ని వేసి వాసన చూడడంతో మరింత అస్వస్థతకు గురయ్యారు. ముగ్గురు విద్యార్థులు గదిలోనే స్పృహ తప్పి పడిపోగా, మిగిలిన వారు ఊపిరి అందక ఇబ్బంది పడ్డారు. పరిస్థితిని గమనించిన ఉపాధ్యాయులు సూర్యలంకలోని ఆస్పత్రికి 25 మందిని తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బాపట్లలోని ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ ఆధ్వర్యంలో వైద్యబృందం తక్షణమే స్పందించి విద్యార్థులకు చికిత్స అందించడంతో మూడు గంటలు తర్వాత కోలుకున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉండటంతో కుటుంబ సభ్యులు వచ్చి పిల్లలను తీసుకెళ్ళారు. విద్యార్థులలో మధురియా అనే బాలిక జ్వరంతో బాధపడుతూనే స్కూల్‌కు వెళ్ళి విషవాయువుల భారినపడటంతో చికిత్స పొందుతుంది. షణ్ముఖ అనే మరో విద్యార్థికి ఈసీజీ తీయగా ఇతర సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.

విద్యార్థులను పరామర్శించిన జేసీ

సంఘటన గురించి తెలుసుకున్న వెంటనే జేసీ బి.సుబ్బారావు ఏరియావైద్యశాలకు వచ్చి విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం ఏమిలేదని అందరు ఆరోగ్యంగా ఉన్నట్లు జేసీ విలేకర్లకు తెలిపారు. విద్యాలయంలో విషవాయువులు వెలువడటానికి కారణమైన టిష్యూ పేపర్లలోని రసాయనాలను సేకరించి ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపించి పరీక్షిస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. 25 మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని చెప్పారు. ఈ సంఘటనపై సీఎంవో అధికారులు జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల చర్యలు తీసుకుని విద్యార్థులకు చికిత్సలు అం దించాలని వారు వైద్యాధికారులను ఆదేశించారు.

వైద్యాధికారులపై జడ్జి వాణి ఆగ్రహం

విషవాయువులతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న ప్రిన్సిపల్ సీనియ ర్ సివిల్ జడ్జి జి.వాణి ఏరియావైద్యశాలను సందర్శించారు. ఆసమయంలో వైద్యులు సరైన సమాచారం ఇవ్వకపోవడం, కొంత మంది వై ద్యుల నిర్లక్ష్యంపై ఓ మహిళ ఫిర్యాదుతో జడ్జి వాణి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశా రు. సూపరింటెండెంట్‌ను పిలిపించి ఉదయం డ్యూటీచార్ట్ గురించి అడిగి తెలుసుకున్నారు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని మిస్ గైడ్ చేయరాదని సున్నితంగా హెచ్చరించారు. అనంతరం విద్యార్థు ల వద్దకు వెళ్ళి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకు న్నారు.



అమరావతి.. ఆహ్లాదం

- పర్యాటక రాజధానిగా అభివృద్ధికి చర్యలు
- ఏడీసీ ఆధ్వర్యంలో బ్లూ-గ్రీన్ ప్రాజెక్టుల నిర్మాణం
- శాఖమూరు, వెంకటపాలెం పర్యటనలో మంత్రి నారాయణ

తుళ్లూరు, ఆగస్టు 24: ప్రజా రాజధాని అమరావతిలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు బ్లూ - గ్రీన్ కాన్సెప్ట్‌తో ఆకర్షణీయమైన పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకు వెళుతుందని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీపార్థసారధితో కలసి వెంకటపాలెం నర్సరీ, శాఖమూరు సెంట్రల్ పార్క్‌లను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా శాఖమూరు సెంట్రల్ పార్కులో జరిగిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. శాఖమూరు, అనంతవరం, నీరుకొండ ప్రాంతాల్లో అందమైన రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి పర్యాటకానికి కేంద్ర బిందువుగా తీర్చి దిద్దుతామన్నారు. హైదరాబాద్ మహా నగరాన్ని పచ్చదనంతో అద్భుతంగా తీర్చిదిద్దిన సీనియర్ అధికారి లక్ష్మీపార్థసారధికి అమరావతిలో పచ్చదనం ప్రాజెక్టుల అభివృద్ధిని ప్రభుత్వం అప్పగించిందన్నారు. 300 ఎకరాల్లో నిర్మాణంలో ఉన్న శాఖమూరు సెంట్రల్ పార్కులో బోటింగ్‌కు అనువుగా 50 ఎకరాల్లో రిజర్వాయర్‌ను నిర్మించి పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. నీరుకొండలో 500 ఎకరాల్లో వాటర్ లేక్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొండవీటి వాగు పాలవాగు, గ్రావిటీ కెనాల్ వంటి నీటి ప్రాజెక్టుల వెంబడి 23-30 మీటర్ల వెడల్పుతో బఫర్ జోన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతవరంలో 35 ఎకరాల్లో ఉద్యానవనం, మల్కాపురంలో 21 ఎకరాల్లో పార్కును ఏర్పాటు చేసి వివిధ రకాల మెడిసినల్ ప్లాంట్స్ పెంచతామన్నారు.



శాఖమూరు సెంట్రల్ పార్కును పరిశీలిస్తున్న మంత్రి నారాయణ ఏడీసీ ఛైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి

సువిశాలమైన రవాణా వ్యవస్థ...

ఏడీసీ ఆధ్వర్యంలో రాజధాని పరిధిలో సువిశాలమైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి రానుందని మంత్రి చెప్పారు. రూ.41 వేల కోట్ల తో వాటర్ లైన్లు, ఐసీటీ పవర్ గ్యాస్, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు, నీటి పారుదల వ్యవస్థల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. గతంలో ఈ ప్రాజెక్టులకు రూ.5,100 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రూ.36 కోట్లతో కంప తొలగింపు పనులు జరుగుతున్నాయన్నారు.

సెప్టెంబరులో ఐఐటీ నివేదికలు

అమరావతిలో గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ప్రాజెక్టుల స్థితిగతులపై మద్రాసు, హైదరాబాద్ ఐఐటీ వారు పర్యటించి రూపొందించిన నివేదికను వచ్చే నెల మొదటి వారంలో అందించనున్నారని మంత్రి చెప్పారు. ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం పూర్వ ప్రాజెక్టు అంచనాలు నేటి నిర్మాణ అంచనాలు సీఆర్డీఏ అథారిటీకి నివేదించి ఆపై మంత్రి వర్గానికి పంపనున్నట్లు చెప్పారు.

డీవీసీ ఆస్పత్రి సేవలు అభినందనీయం

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- సంగం నూతన కార్డియాక్ ఐసీయూ ప్రారంభం



● ఐసీయూలోని వసతులను పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే నరేంద్ర దంపతులు ఇతర డాక్టర్లు, సిబ్బంది

6లో..

పర్యావరణాన్ని కాపాడాలి

మొక్కలు నాటిన కలెక్టర్ నాగలక్ష్మి


మేడికొండూరు, ఆగస్టు 24: వాతావరణ సమతౌల్యానికి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. పేరేచర్లలోని వీఆర్‌వో థామస్ లైవ్‌లీ హుడ్ లెర్నింగ్ సెంటర్లో శనివారం జరిగిన మొ క్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విలేజ్ రీకన్‌స్ట్ర క్షన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పదివేల మొక్కలు నాటాలనే సంకల్పం అభినందనీయమన్నారు. 15 గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, మూడు పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మన కోసం, మన భవిష్యత్ కోసం చేపట్టే గొప్ప కార్యక్రమం ఈ కార్యక్రమమన్నారు. కనీసం ఈ మొక్కలను మూడేళ్ల వరకు సంరక్షించాలన్నారు. జిల్లాలో మొక్కలు నాటేందుకు రెండు లక్షల మొక్కలను సమీకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమం లో విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకు లు వేలాంగణి, డీఎఫ్‌వో మహబూబ్‌బాషా, డ్వామా పీడీ ఉమాదేవి, డీసీవో వీరాచారి, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు, తహసీల్దార్ పద్మనాభుడు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ కిరణ్ పాల్గొన్నారు.



లెర్నింగ్ సెంటర్లో మొక్కలు నాటిన కలెక్టర్ నాగలక్ష్మి, డీఎఫ్‌వో మహబూబ్ బాషా

వర్సిటీలో అరబిక్ భాషపై సర్టిఫికెట్ కోర్సు

పెదకాకాని, ఆగస్టు 24: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ విద్యార్థుల విభాగం ఆధ్వర్యంలో "సర్టిఫికెట్ కోర్స్ ఇన్ అరబిక్ లాంగ్వేజ్" అనే మూడు నెలల కోర్సును ప్రారంభిస్తున్నట్లు ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య పి. పద్మావతి శనివారం తెలిపారు. ఈ కోర్సు తరగతులను గుంటూరులోని అభ్యుదయ మహిళా కళాశాల ప్రాంగణంలో ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటలు పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుతో గల్ఫ్ దేశాలలో, కార్పొరేట్ కంపెనీలలో అపార ఉద్యోగావకాశాలు ఉంటాయని విశ్వ విద్యాలయ ఇంచార్జి ఉపకులపతి ఆచార్య గంగాధరరావు తెలిపారు. ఈ కోర్సుకు 8వ తరగతి చదివిన వారు అర్హులని, ఈ కోర్సుకు మూడు నెలలకుగానూ రూ.2,000 చెల్లించాలని విశ్వవిద్యాలయ ఇంచార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహచలం తెలియజేశారు. గల్ఫ్ దేశాలలో ఉద్యోగాలు చేయాలి అనుకునేవారు, సద్వినియోగం చేసుకోవాలని విశ్వవిద్యాలయ ఇన్చార్జి రెక్టార్ ఆచార్య రత్న షీలామణి సూచించారు. అభ్యర్థులు అభ్యుదయ మహిళా కళాశాల ప్రిన్సిపల్ రోహిణి దేవిని సంప్రదించాలన్నారు. వివరాలకు 0863- 2231359, 9848139454 నంబర్లలో సంప్రదించాలన్నారు.



సాంకేతిక అన్వేషణలో భారత్ అగ్రస్థానం

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ
- అట్టహాసంగా విజ్ఞాన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం
- ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్‌లు
- 1,539 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం
- 60 మంది విద్యార్థులకు బంగారు పతకాలు



మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య



లోకేష్ మెషిన్స్ అధినేత ముళ్ళపూడి లోకేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న జస్టిస్ శ్రీనరసింహ

గుంటూరు(విద్య),ఆగస్టు 24: సాంకేతిక అన్వేషణలో భారత్ అగ్రస్థానంలో ఉందనీ, కొత్త పద్ధతులను అనుసరించడం వలన యువత సులువుగా లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉందని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ చెప్పారు. ప్రపంచం విభిన్న నైపుణ్యాలు కలిగిన విద్యార్థుల కోసం ఎదురుచూస్తోందని ఉద్ఘాటించారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శనివారం 12వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శనివారం వర్సిటీ ప్రాంగణంలో స్నాతకోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ మాట్లాడుతూ యువత డిగ్రీ పట్టాలతో సంస్థ సరిహద్దులను దాటి వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారని, ఇప్పుడే కొత్త సవాళ్లను అధిగమించాలని సూచించారు. జీవితంలోని ప్రతి అంశం లోతైన విప్లవానికి నాంది పలుకుతుందన్నారు. ఉత్సుకత ఎక్కడికి దారితీస్తుందో దానిని అన్వేషించాలని, మూస ధోరణిలో వెళ్లకుండా మార్పును స్వాగతించాలన్నారు.

ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు

12వ స్నాతకోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో కృషి చేసిన హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ఫౌండర్ అండ్ చైర్మన్ దొంతినేని శేషగిరిరావు, హైదరాబాద్‌లోని లోకేష్ మెషీన్స్ ఫౌండర్ ముల్లంపూడి లోకేశ్వరరావు, ఇండియన్ కంపోజర్ అండ్ సింగర్ సాలూరి కోటేశ్వరరావు (కోటి) లకు విజ్ఞాన్స్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేసింది.

ఏఐ విస్తరిస్తుంది..

విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ 12వ స్నాతకోత్సవం సందర్భంగా 1539 మంది విద్యార్థులకు డిగ్రీలు, 60 అకడమిక్ గోల్డ్ మెడల్స్ అందించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని లోకేష్ మెషీన్స్ ఫౌండర్ ముల్లంపూడి లోకేశ్వరరావు మాట్లాడుతూ వృత్తిపరమైన విజయాలను కుటుంబం, స్నేహితులు, శ్రేయోభిలాషులతో జరుపుకోవడానికి ఇది ఒక చిరస్మరణీయ వేదికని అన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రస్తుతం కొత్త శకం ప్రవేశంలో ఉన్నామని, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మనం పని చేసే విధానం నుంచి ఇతరులతో మనం కనెక్ట్ అయ్యే విధానం వరకు మన జీవితంలోని ప్రతి కోణాన్ని విస్తరిస్తుందని పేర్కొన్నారు. విజ్ఞాన్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రసంగిస్తూ పట్టభద్రులవుతున్న మీరందరూ ప్రపంచంపై మీ ముద్ర వేయడానికి ప్రయత్నించండని పిలుపునిచ్చారు. డిగ్రీలు చేతబట్టుకున్న వేళ విద్యార్థుల సంబరం అంబరాన్ని అంటింది. కేరింతలతో వర్సిటీ ప్రాంగణమంతా హోరెత్తింది. విద్యార్థులు తలపాగా, కండువా వేసుకుని అచ్చతెలుగు పెద్ద మనుషుల్లా కనిపించారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబిస్తూనే సాంకేతిక విద్యా సర్టిఫికెట్లను పొందారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, బోర్డు ఆఫ్ మేనేజిమెంట్ సభ్యులు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీవీసీ ఆస్పత్రి సేవలు అభినందనీయం

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- సంగం నూతన కార్డియాక్ ఐసీయూ ప్రారంభం



డీవీసీ కార్డియాక్ ఐసీయూను ప్రారంభిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు) ఆగస్టు24: లాభాపేక్ష లేకుండా గ్రామీణ ప్రాంతంలో డీవీసీ ఆస్పత్రి అందిస్తున్న కార్పొరేట్ వైద్య సేవలు అభినందనీయమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. వడ్లమూడి సంగం డెయిరీ డీవీసీ ఆస్పత్రిలో శనివారం డీవీసీ కార్డియాక్ ఐసీయూ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు విభాగాలను ఆయన సందర్శించారు. సంగం ఆవరణలోని మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ప్రారంభించిన ఆరేళ్ల కాలంలోనే డీవీసీ ఆస్పత్రి ప్రజల మన్ననలు చూరగొందన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఈ ప్రాంత రైతుల, ప్రజల సంక్షేమం కోసం తండ్రి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అభినందించారు. సంగం డెయిరీ విలువైన బ్రాండ్‌గా రూపాంతరం చెందుతుందన్నారు. తక్కువ కాలంలో పది సూపర్ స్పెషాల్టీ సేవలు, 15 స్పెషాల్టీ సేవలను అందిస్తుందన్నారు. రాష్ట్రంలో కౌమార దశ బాలికలు 51 శాతం మంది రక్తహీనతలో బాధపడుతునట్టు చెప్పారు. గర్భిణీల్లో 37 శాతం మంది రక్తహీనతతో ఉన్నారన్నారు. క్యాన్సర్ వల్లన తన తల్లి, అక్క బాధ పడ్డారని, రాష్ట్రంలో 5.30 కోట్ల మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించబోతునట్లు చెప్పారు.

సంగం వ్యవస్థకు సేవకులమే...

ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సంగం వ్యవస్థకు సేవకులమే గానీ యజమానులం కాదన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్, సీఈవో డాక్టర్ కరణం నవీన్, డాక్టర్ దక్షిణామూర్తి, పలు విభాగాల వైద్యులు, సంగం పాలకవర్గ సభ్యులు, పాల రైతులు పాల్గొన్నారు.

1.0615 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 24: నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0615 ఎంయూల విద్యుదుత్పత్తి చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. 3 గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి దిగువకు 21,240, టేల్ రేస్ చానల్ ద్వారా 8,850 మొత్తంగా 30,090 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. సాగర్ నుంచి 29 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 7.0390 టీఎంసీల నీరుండగా ఈ నీరు 75.44 మీటర్లకు సమానమన్నారు. విద్యుదుత్పత్తిలో ఈ ఏడాది లక్ష్యాన్ని అధిగమించినట్లు ఎస్ఈ చెప్పారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు నెలాఖరు వరకు విద్యుదుత్పత్తి లక్ష్యం 15 ఎంయూలు కాగా శుక్రవారం అర్ధరాత్రి వరకు 16.75 ఎంయూల విద్యుత్ తయారైందని చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

ఆరోగ్యసేవలు గ్రామాలకు విస్తరించాలి

- నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, పక్కన భాష్యం రామకృష్ణ

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 24: స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం ద్వారా గ్రామీణ ఆరోగ్య ప్రమాణాలు మెరుగవుతాయని లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. శనివారం గుంటూరులోని ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, మానవత, కొరిటాల ఇందిర శేషగిరిరావు ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ అందిస్తున్న సేవలను అభినందిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అన్ని శాఖలు ఈ కృషిని కొనసాగించాలన్నారు. నగరంలోని కొరిటెపాడులో ఈ మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులను భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ అభినందించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ సేవా రంగాలలో ఉండాల్సిన విద్య, వైద్యం కార్పొరేట్‌గా మారడం వలన పేదలు అప్పుల పాలవుతున్నారని, ఇలాంటి వైద్య శిబిరాలతో కొంతమేర ఊరట కలిగించవచ్చున్నారు. బ్యాంకు మేనేజర్ కోటా బుల్లి కుమార్ మాట్లాడుతూ అతి తక్కువ వడ్డీ రేట్లతో విద్యా రుణాలు అందిస్తూ పేద ప్రజలకు సాయ పడుతున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో పాటిబండ్ల శివాజీ, పి.ప్రసన్నకుమార్, యన్.వి. పద్మజ, శంకర్ కంటి ఆసుపత్రి సిబ్బంది హాజరై 150 మంది రోగులకు సేవలను అందించారు. గురజాల పట్టణానికి చెందిన వైద్యుడు చల్లగుండ్ల శ్రీనివాస్, కొరిటాల శేషగిరిరావు, ఇందిర, మానవత చైర్మన్ పావులూరి రమేష్, అధ్యక్షులు కొమ్మలపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి కె.సతీష్, టి.ధనంజయ రెడ్డి, బ్యాంక్ కమిటీ మెంబర్స్ కోట మాల్యాద్రి, ఎస్.లక్ష్మీ సుజాత, కె.రమణ బాబు, యన్.సాంబశివరావు, వి.సుబ్రహ్మణ్యం, గురవారెడ్డి, లక్ష్మీ సామ్రాజ్యం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యునివర్సిటీ లో పలువురికి పదోన్నతులు

పెదకాకాని, ఆగస్టు 24 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం పలువురికి పదోన్నతులు లభించాయి. ఈమేరకు ఇన్చార్జి ఉపకులపతి ఆచార్య కె. గంగాధర రావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కె. రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం లు పదోన్నతులు పొందిన వారికి ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతులు పొందిన వారిలో డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ హోదాలలో 29 మంది ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంలో పదోన్నతులు పొందిన ఉద్యోగులు ఉపకులపతి, రెక్టర్, రిజిస్ట్రార్ లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వికాస ప్రధాన కార్యదర్శి కావూరి శ్రీనివాసరావు, జాయింట్ రిజిస్ట్రార్ సత్యవతి, ఎన్జీవో యూనియన్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 24: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,076 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,367 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,867 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 48,710 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 48,710 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న దాతలు

నూతన భవన సముదాయానికి రూ.6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24 : జేకేసీ రోడ్డులోని కమ్మ జనసేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో ఒక గది నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం రూ.6 లక్షల విరాళాన్ని ప్రభుత్వ మహిళా కళాశాల విశ్రాంత అధ్యాపకులు మేకా లక్ష్మీ తులసమ్మ ప్రకటించారు. కుందులరోడ్డులోని కమ్మ జన సేవాసమితి బాలికల వసతి గృహంలో శనివారం చెక్కును సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మేకా లక్ష్మీ తులసమ్మ మాట్లాడుతూ పారదర్శకత, విద్యార్థినులకు రక్షణ, పరిశుభ్రమైన భోజనం అందిస్తున్న కమ్మ జన సేవ సమితి సేవలు అభినందనీయమని అన్నారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ నూతన భవన నిర్మాణం మొదలైందని, త్వరలోనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. దాతలు ఇచ్చిన నిధులను సద్వినియోగం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సుంకర రామ్‌మోహన్, ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకుడు చెన్నుపాటి ప్రకాష్, సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, కోశాధికారి గోరంట్ల పున్నయ్య చౌదరి, సభ్యులు గుంటుపల్లి కోటేశ్వరరావు, మత్రిపూడి సీతారామయ్య, ఘంటా పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24 : సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 28న జరిగే భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగంభవన్‌లో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో భూ బాధితులు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉన్నారని, వారి సమస్యలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి 6వ తేదీ వరకు అధిక ధరలకు నిరసనగా ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు కోట మాల్యాద్రి, మేడా హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, బందెల నాసర్ జీ, షేక్ వలి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జంగాల అజయ్‌కుమార్ తదితరులు

27 నుంచి పాఠశాల విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు

గుంటూరు(విద్య),ఆగస్టు 24 : ఈనెల 27 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.శైలజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలు కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా అందజేస్తామని తెలిపారు. విద్యార్థులకు 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఓఎంఆర్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. జిల్లాలోని సీబీఎస్‌ఈ పాఠశాలలకు కూడా ప్రశ్నాపత్రాలు సరఫరా చేస్తామని తెలిపారు. అన్ని పాఠశాలలకు మండల విద్యావనరుల కేంద్రం నుంచి ప్రశ్నా పత్రాలు పంపుతామని ప్రతిరోజు గంట ముందుగా మాత్రమే మండల స్థాయిలో కమిటీలు పశ్నాపత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. ప్రశ్నాపత్రాలు బహిర్గతం(లీక్) అయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సెప్టెంబరు 26 నుంచి నారా చంద్రబాబు నాటకోత్సవం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24 : అభినయ థియేటర్ ట్రస్ట్, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సెప్టెంబరు 26, 27, 28 మూడు రోజుల పాటు నారా చంద్రబాబు నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అభినయ థియేటర్ ట్రస్ట్ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్ తెలిపారు. బ్రాడీపేటలో ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నాటకోత్సవంలో ఉమ్మడి రాష్ట్రాల నుంచి వచ్చిన నాటికలను ప్రదర్శిస్తామని అన్నారు. ప్రతి రోజు రెండు నాటికలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. నాటికల వివరాలు, ప్రదర్శన సమయం, ఇతర అంశాలను త్వరలోనే ప్రకటిస్తామని అన్నారు. సమావేశంలో ట్రస్ట్ సలహాదారు జొన్నలగడ్డ శ్రీనివాస్, ట్రస్టీలు క్రోసూరి సుబ్బారావు, గుంటుపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ వెంకయ్య స్వామి ఆరాధన మహోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో వెంకయ్య స్వామి చిత్రపటం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24 : స్థానిక కృష్ణనగర్ 1వ లైన్ కుటీరంలో ఉన్న శ్రీ వెంకయ్య స్వామి 25వ ఆరాధన మహోత్సవాలను భక్త బృందం శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి సుప్రభాతసేవ, పూలంగి సేవ, పంచామృతాభిషేకం, అగ్నిగుండ హోమాలు, స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ జరిగింది. సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్య స్వామి భక్త బృందం, స్థానికులు పాల్గొన్నారు.

అలరించిన శ్రీకృష్ణ సంకీర్తన గానలహరి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం భక్త నారద గానసభ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదిన సందర్భంగా డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్యచే శ్రీకృష్ణ సంకీర్తన గాన లహరి కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆకురాతి కోదండరామయ్య పలు శ్రీకృష్ణ సంకీర్తనలు శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వీరికి వయోలిన్‌పై పాలపర్తి ఆంజనేయశాస్త్రి, తబలపై చిట్టిబాబు వాయిద్య సహకారం అందించారు.

విద్యార్థులకు వార్షిక పోటీలు

గుంటూరు(విద్య), ఆగస్టు 24: స్థానిక పాత బస్టాండులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ముగ్గురు విద్యార్థులు ఒక టీంగా 12 మండలాల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో దుగ్గిరాల జడ్పీ స్కూల్ వ్యాసరచన పోటీల్లో, ఎస్‌డీఐ మున్సిపల్ స్కూల్ కొత్తపేట(తెనాలి) విద్యార్థులు వక్తృత్వం పోటీల్లో విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీవో విజయలక్ష్మి, ఉర్దూ డీఐ ఎస్‌కేఎండీ ఖాసిం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌వీ నరసింహారావు మృతికి పలువురి సంతాపం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 28: సీనియర్ కమ్యూనిస్టు ఉద్యమ నేత, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నాయకుడు ఎన్‌వీ నరసింహారావు మృతికి పలువురు సంతాపాన్ని తెలిపారు. స్థానిక కొరిటెపాడులోని ఆయన నివాసంలో ఆయన భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాదు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్, పౌర హక్కుల సంఘ నాయకులు చిలకా చంద్రశేఖర్, కోటా మాల్యాద్రి, కె.నళినీకాంత్, బి.ముత్యాలరావు, విరసం నాయకుడు సీఎస్‌ఆర్ ప్రసాద్ తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

కాంగ్రెస్ వైఖరితో దేశ సమగ్రతకు ప్రమాదం : బీజేపీ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24: జమ్ము కాశ్మీర్‌లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య పొత్తు అప్రజాస్వామికమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ అన్నారు. ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశ సమగ్రతకు భంగం కల్గించేలా కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని విమర్శించారు. అధికారం కోసమే మతతత్వ పార్టీతో పొత్తు కుదుర్చుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 370 ఆర్టికల్ తిరిగి తీసుకొస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ మాటలపై రాహుల్‌గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాహుల్‌గాంధీ పొత్తుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇంటింటి ఓటర్ సర్వేలో బీఎల్‌వోలు

● కమిషనర్ పులి శ్రీనివాసులు


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 24: గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో బీఎల్‌వోలు ఇంటింటి ఓటర్ సర్వే చేస్తున్నారని, కేంద్ర ఎన్నికల సంఘం నుంచి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు సర్వేలో పాల్గొని పరిశీలించవచ్చని తూర్పు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్‌ఓ), నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ చాంబర్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025పై శనివారం రాజకీయపార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ బీఎల్‌వోలు నగరంలోని 2 నియోజకవర్గాల్లో ఇంటింటి ఓటర్ సర్వే చేస్తున్నారన్నారు. బీఎల్‌వోలు అక్టోబర్ 18 వరకు ప్రతి ఇంటిని సందర్శించి అర్హతగల కొత్తగా ఓటర్ల నమోదు, నగరం నుంచి శాశ్వతంగా వదిలివెళ్ళిన వారు, మరణించిన వారిని తొలగించుట, తప్పుల సవరణపై చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో ఈఆర్వో, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఏఈఆర్వో, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ పద్మ, ఓంకార్ (టీడీపీ), డి.జాన్‌బాబు (వైసీపీ), బి.సునీల్‌కుమార్ (కాంగ్రెస్), ఎస్.కార్తీక్ (సీపీఐ(ఎం) పాల్గొన్నారు.

పశువులను యజమానులు ఇళ్లలోనే కట్టేసుకోవాలి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆవులు, పందులు, గాడిదలను యజమానులు తమ ఇంటి పరిసరాల్లోనే కట్టడి చేసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో నగర ప్రజలకు స్పష్టం చేశారు. పందుల పెంపకందార్లు నగరపాలక సంస్థ నుంచి అనుమతులు, లైసెన్సు కలిగివుండాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగజేసే ప్రజారోగ్యానికి హానికరమైన ఎటువంటి జంతువులను తమ నివాస లేదా గృహ ప్రాంగణంలో కలిగి ఉండరాదన్నారు. అటువంటి పందులు, ఆవులు, గాడిదలు, పెంపుడు కుక్కలు రోడ్ల మీదకు వస్తే వాటిని నగరపాలక సంస్థ సిబ్బంది స్వాధీనం చేసుకొని బందెల దొడ్డికి తరలిస్తామన్నారు. సదరు యజమానులకు జరిమానాలు విధించడం, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శివారు ప్రాంతాలకు తాగునీరు అందేలా చర్యలు : కమిషనర్

నగర శివారు ప్రాంతాల ప్రజలకు తాగునీటి సరఫరా చేసేలా నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ స్వర్ణభారతినగర్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. నగర శివారు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకి సంబంధించి ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయని, ఆయా ప్రాంతాలకు తాగునీటిని అందించేందుకు ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రధాన పైప్ లైన్లపై ఉన్న లీకులకు వెంటనే మరమ్మతు చేసి పూర్తిస్థాయిలో సరఫరా జరిగేలా చూడాలన్నారు. అనంతరం పారిశుధ్య పనులు పరిశీలించి, ప్రతి ఇంటి నుంచి నిర్దేశిత సమయంలో చెత్త సేకరణ జరగాలని, రోడ్లమీద కాల్వల్లో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఖాళీస్థలాల యజమానులను గుర్తించి సదరు స్థలాల్లో పిచ్చిమొక్కలు శుభ్రం చేయించాలని లేకుంటే చట్టపరంగా అపరాధ రుసుం విధిస్తామన్నారు. రోడ్ల మార్జిన్లు, డ్రెయిన్‌లు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని, వెంటనే ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, డీఈఈ హనీఫ్, ఏఈ అనూష, శానిటరీ సూపర్‌వైజర్ సోమశేఖర్, ఇన్‌స్పెక్టర్ డేవిడ్, ఆర్‌ఐ శ్యామ్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు : కమిషనర్

నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో ఎక్కడా రాజీలేదని, తాగునీటి సరఫరాపై సమగ్ర నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ శనివారం హెడ్ వాటర్ వర్క్స్‌ని పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. హెడ్ వాటర్ వర్క్స్‌లో సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని, ముడినీటిని ట్రీట్మెంట్ చేసేప్పుడు అలం, క్లోరినేషన్ పక్కాగా నిర్దేశిత ప్రమాణంలో ఉండేలా చూడాలన్నారు. ల్యాబ్ లో ఎప్పటికప్పుడు శ్యాంపిల్స్ పరిశీలించాలని, శ్యాంపిల్స్ రిపోర్ట్ నిర్దేశిత రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. అనంతరం బాలాజీ నగర్‌లోని మొండి గేటు దగ్గర డ్రెయిన్ రైల్వే క్రాసింగ్‌ని పరిశీలించి, మొండి గేటు దగ్గర రైల్వే ట్రాక్ కింద డ్రెయిన్ దగ్గర మురుగు నీరు నిలిచి సమస్యగా ఉందన్నారు. రైల్వే శాఖతో సమన్వయం చేసుకొని సమస్య పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఈఈ శ్రీనివాస్, డీఈఈ శ్రీధర్, ఏఈలు బాబర్, సునీల్ కుమార్, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు


చిన్నారులతో భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య), ఆగస్టు 24 : స్థానిక చంద్రమౌళినగర్‌లోని భాష్యం విద్యాసంస్థల్లో శనివారం ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుని జన్మవృత్తాంతం, శ్రీకృష్ణ లీలను కళ్లకు కట్టినట్లుగా చిన్నారులు ప్రదర్శించారు. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ కృష్ణ పాదాల ముగ్గులు పెట్టడం, ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాలు అలరించాయి. భాష్యం మెయిన్ క్యాంపస్ లిటిల్ చాంప్స్, బ్లూమ్స్, టాడ్లర్స్, సాంబశివపేట, ఆర్టీసీ కాలనీ, పట్టాభిపురం, ఎస్‌వీఎన్ కాలనీ, ఎన్జీవో కాలనీ, నగరాలు, భాష్యం ఇతర బ్రాంచీలలో ముందస్తు జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ చిన్ననాటి నుండే మన సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడంతో పాటు మన పండుగలు, వాటి ప్రాముఖ్యత గురించి తెలియజేస్తూ ఇలా వేడుకల రూపంలో నిర్వహించడం ద్వారా మన సంప్రదాయాలపై విద్యార్థుల్లో గౌరవభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్స్, క్యాంపస్ ఇన్‌చార్జ్‌లు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ పాఠశాలలో..

స్థానిక ఎల్‌ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో శనివారం శ్రీ కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో జ్ఞానం పొందేలా, పండుగల విశిష్టతను తెలిసేలా ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కేఎల్‌పీ స్కూల్‌లో ..

స్థానిక జేకేసీ రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పాఠశాలలో ఘనంగా ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల కార్యదర్శి డాక్టర్ కె కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు శ్రీకృష్ణుని జన్మదిన విశేషాలను వివరించారు. శ్రీకృష్ణుని పాదాల గుర్తులు వేసి శ్రీకృష్ణుని ఆహ్వానిస్తూ గీతాలాపన చేశారు. విద్యార్థులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.రత్తయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ విద్యాసంస్థల్లో..

స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ విద్యా సంస్థలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రాధా కృష్ణులు, గోపికల సినీ నృత్య గీతాలకు అనుగుణంగా వేషధారణలతో ఆడి పాడారు. ఈ సందర్భంగా విద్యా సంస్థ కార్యదర్శి, కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ మాట్లాడుతూ దేశంలోని ప్రధాన మతాల గొప్పదనాన్ని, పండుగల పరమార్థాన్ని తెలియజేసేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ యూత్ లీడర్ ట్రైనర్ వరాహ కృష్ణదాస్, పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బీహెచ్ డిగ్రీ కళాశాలలో...

స్థానిక బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు కోలాటం, బృందనృత్యాలతో ఆలరించారు. కృష్ణవేషధారణలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ బీవీ విజయ భాస్కర్, కార్యదర్శి చేగు శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీ కౌసల్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాధామాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

హిందూ పబ్లిక్ స్కూల్లో...

గుంటూరు, ఆగస్టు 24 : స్థానిక అరండల్‌పేటలోని హిందూ పబ్లిక్ స్కూల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పఠనం, చిత్రలేఖ పోటీలలో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణా గీతాలకు చిన్నారులు చేసిన కోలాటం నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మందలపు సురేష్ చౌదరి, స్కూల్ కార్యదర్శి మద్దూరి రామకృష్ణ పరమహంస, పెమ్మరాజు సుధాకర్, పెద్దింటి కృష్ణ చైతన్య, స్కూల్ ప్రిన్సిపల్ సౌజన్య, కె.సునీత పాల్గొన్నారు.

2 నుంచి సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సమావేశాలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24 : గుంటూరు, లింగాయపాలెంలోని కొల్లా వెంకయ్య విజ్ఞాన కేంద్రంలో సెప్టెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సమావేశాలు జరుగుతాయని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మన్నవ హరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకి దేశంలోని 20 రాష్ట్రాల నుంచి సుమారు 40 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సమావేశాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపైన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, కృష్ణా, గోదావరి గ్యాస్ బేసిన్‌లో రాష్ట్రానికి రావాల్సిన వాటా, ఇతర అంశాలపై సమావేశం జరుగుతుందని తెలిపారు.

నేడు కొరిటెపాడు ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ సమావేశం

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 24 : కొరిటిపాడు ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం జరగనుంది. సమావేశంలో కొత్త సభ్యత్వ నమోదు, నూతన పాలకవర్గం ఎన్నిక వంటి అంశాలపై చర్చించనున్నారు.


తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి కుమార్తె యంగేజ్‌మెంట్ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన నాట్స్ మాజీ అధ్యక్షుడు మన్నవ మోహనకృష్ణ - గుంటూరు (ఆంధ్రజ్యోతి).


టీడీపీ నాయకుడు మేకల బాబూరావు జన్మదిన వేడుకలను నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ శనివారం తన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎర్రగోపు నాగేశ్వరరావు, శివరామ్, నిశంకరరావు, అమర్నాథ్, రమేశ్, సదా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి).


సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తదితరులు

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహకు అధికారుల స్వాగతం

గుంటూరు, ఆగస్టు 24 : నగరానికి శనివారం విచ్చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహకు జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్ బీజీ పార్థసారథి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ శ్రీనరసింహ, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్‌లు జిల్లా కోర్టు ఆవరణలో మొక్కలను నాటి నీరు పోశారు.

సీఎంఏ ఫలితాలలో మాస్టర్‌మైండ్స్‌దే అగ్రస్థానం


మాట్లాడుతున్న మట్టుపల్లి మోహన్

గుంటూరు(విద్య),ఆగస్టు 24: జాతీయ స్థాయిలో ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా శుక్రవారం ప్రకటించిన సీఎంఏ ఫలితాలలో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు మరోసారి అగ్రస్థానంలో నిలిచారని అడ్మిన్ అడ్వయిజర్ మట్టుపల్లి మోహన్ వెల్లడించారు. ఈమేరకు శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంఏ ఫైనల్‌లో మొదటి 10 ర్యాంకులలో జాతీయ స్థాయిలో కె తేజస్విని ప్రథమ ర్యాంకు, జైమిత్రా పబ్బిశెట్టి 3వ ర్యాంకు, ఇందుహూరి సతీష్ 8వ ర్యాంకు సాధించారని తెలిపారు. స్థాయిలో ర్యాంకులుతోపాటు 50 ర్యాంకుల లోపు సాధించిన విద్యార్థులు 14 మంది ఉన్నారని తెలిపారు. సీఎంఏ ఇంటర్‌లో మొదటి 50 ర్యాంకులతోపాటు జాతీయ స్థాయిలో ఎంవీ లక్ష్మీనారాయణ 3వ ర్యాంకు, పక్షాల్ జైన్ 9వ ర్యాంకుతో పాటు మరో 25 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించిన వారిలో ఉన్నారని వివరించారు.

కేరళ సీఎం సహాయనిధికి రావెళ్ళ లక్ష్మయ్య విరాళం

గుంటూరు, ఆగస్టు 24: కేరళలో ప్రకృతి విపత్తుతో భారీ నష్టం వాటిల్లిన నేపథ్యంలో టుబాకో బోర్డు రిటైర్డ్ అధికారి రావెళ్ళ లక్ష్మయ్య తన వంతు విరాళం అందించారు. కేరళ సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళంగా రూ.11,111లు చెక్కు పంపించినట్లు ఆయన తెలిపారు. 2018లో కూడా కేరళలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఇలానే కేరళ సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళం పంపినట్లు గుర్తుచేశారు.



శ్రీవారి సేవలో ఎమ్మెల్యే గళ్లా మాధవి దంపతులు

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి, రామచంద్రరావు దంపతులు శనివారం తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.
- గుంటూరు (ఆంధ్రజ్యోతి).

ఏపీ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్



ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ కార్యాలయం- 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పేద విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రానికి 4087 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.

అర్హత: విద్యార్థులు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు; వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలి. ఏడో తరగతిలో జనరల్ విద్యార్థులకు 55 శాతం మార్కులు; ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు 50 శాతం మార్కులు ఉండాలి. ఎనిమిదో తరగతిలో కూడా ఇలాగే మార్కులు తెచ్చుకోవాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు.

రాత పరీక్ష: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటిది మెంటల్ ఎబిలిటీ టెస్ట్(ఎంఏటీ), రెండోది స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ). ఒక్కో పార్ట్‌లో 90 చొప్పున మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఏడు, ఎనిమిది తరగతుల సిలబస్ ఆధారంగా సైన్సెస్, మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ కేటగిరీ విద్యార్థులకు 40 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం మార్కులు రావాలి.

స్కాలర్‌షిప్: రాత పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు తొమ్మిది నుంచి ఇంటర్ పూర్తిచేసేవరకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12,000 ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** www.bse.ap.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/ZbiB0SEలో చదవండి.

దిక్సూచి
DIKSUCHI

ఏపీ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫీమేల్)/ ఏఎన్ఎం ట్రెయినింగ్

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం(సీహెచ్&ఎఫ్‌డబ్ల్యూ)- మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ-ఫీమేల్)/ఏఎన్ఎం కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కోర్సు వ్యవధి రెండేళ్లు. రాష్ట్రంలోని ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలల్లో మొత్తం 2,330 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లన్నీ ఉచితమే. ప్రైవేట్ కళాశాలల్లో 60 శాతం సీట్లు ఉచితం కాగా మిగిలిన 40 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటాకు చెందుతాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా నింపి నిర్దేశిత ధ్రువపత్రాలు జతచేసి సంబంధిత జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వ్యక్తిగతంగా గానీ/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గానీ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి:** అక్టోబరు 15
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21 నుంచి
- **వెబ్‌సైట్:** http://cfw.ap.nic.in

పీహెచ్‌డీ

జేఎన్‌టీయూ అనంతపురంలో..

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్‌లు, రీసెర్చ్ ప్రొఫెషనల్స్, పబ్లిక్ రిప్రజంటేటివ్‌లు దరఖాస్తు చేసుకోవచ్చు.

రీసెర్చ్ విభాగాలు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫుడ్ టెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, ఫార్మసీ.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు; ప్రైవేట్ ఇండస్ట్రీల్లో ఎగ్జిక్యూటివ్ కేడర్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

- **స్పీడ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూ, అనంతపురం-515002
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in



కర్నూలు ఐఐఐటీడీఎంలో..

కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్(ఐఐఐటీడీఎం)- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ స్కీమ్ కింద ఫుల్ టైమ్ పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంజనీరింగ్ విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), మెకానికల్ ఇంజనీరింగ్(ఎంఈ)

సైన్స్ విభాగాలు: ఫిజిక్స్, మేథమెటిక్స్

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీతో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కనీసం 7 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఏదేని ఇంజనీరింగ్ కళాశాల నుంచి 75 శాతం మార్కులతో డిగ్రీ పూర్తిచేసి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- సైన్స్ విభాగాలకు సంబంధిత మాస్టర్స్ డిగ్రీతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/నెట్/ఎన్‌బీహెచ్‌ఎం స్కోర్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులు; ఐఐటీల నుంచి 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: ఎంపికైన అభ్యర్థులకు విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి రెండేళ్లు నెలకు రూ.43,750 అందిస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు అటెండ్ అయ్యే వారికి రూ.లక్షన్నర ఇస్తారు.

- **చివరి తేదీ:** సెప్టెంబరు 8
- **వెబ్‌సైట్:** iiitk.ac.in/

నవ్య | చిత్రజ్యోతి

నిజంగా స్మగ్లింగ్ చేస్తే తప్పు పట్టాలి

● అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

పవన్ కల్యాణ్, నాగబాబు, అల్లు అర్జున్ తరచూ చేస్తున్న వ్యాఖ్యలతో మెగా ఫ్యామిలీలో విభేదాలు ఉన్నాయంటూ కొన్నాళ్లుగా మీడియాలో ఉధృతంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. అయితే ఈ వార్తలపై ఇప్పటి దాకా మెగా, అల్లు కుటుంబాల నుంచి ఎవరూ నేరుగా పెదవి విప్పింది లేదు. కానీ ఇప్పుడు తొలిసారి అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి ఈ విషయంపై స్పందించారు. ఓ మీడియా చానల్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇప్పుడు హీరోలు స్మగ్లర్ల వేషాలు వేస్తున్నారు' అంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు, 'స్నేహితుల కోసం ఎక్కడిదాకా అయినా వస్తాను' అంటూ అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

- కల్యాణ్ గారు ఏ సందర్భంలో అలా మాట్లాడారో తెలియదు. ఆయన మాటవరసకు అలా అని ఉంటారు అని నేను అనుకుంటున్నాను. కానీ ప్రజల్లోకి తప్పుడు సందేశం పోతోంది. తర్వాతైనా ఆయన 'నా ఉద్దేశం ఇది' అని చెబితే బాగుండేది. ఆయనే స్వయంగా పూనుకొని సరిదిద్దితే బాగుండేదని నా అభిప్రాయం.



- ఎన్టీఆర్ నటుడిగా రావణుడు, దుర్యోధనుడి పాత్రలు పోషించారు. అంటే దానర్థం మొత్తం స్త్రీ జాతిని ఆయన కించపరిచాడని కాదు కదా. ఆ తర్వాత ఆయన ముఖ్యమంత్రి కూడా అయ్యారు. పవన్ కల్యాణ్ కూడా నటుడిగా ఉండి రాజకీయ నాయకుడయ్యారు. సినిమా యాక్టర్‌ను యాక్టర్‌గానే చూడాలి. వారి వ్యక్తిత్వాలకు ఆ పాత్రల స్వభావాన్ని అంటగట్టే ప్రయత్నం చేయకూడదు. అల్లు అర్జున్ నిజంగా స్మగ్లింగ్ చేస్తే తప్పు పట్టాలి.
- అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడి అవార్డ్ వచ్చింది. 69 ఏళ్లలో ఎవరికీ రాని అవార్డ్ ఆయన్ను వరించింది. ఆయన మిత్రపక్షం బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఎన్డీయే ప్రభుత్వమే అర్జున్‌కు ఉత్తమ నటుడు అవార్డ్ ఇచ్చింది. అది పవన్ కల్యాణ్‌కు తెలియదా? మంచీ చెడూ చూడకుండానే భారత ప్రభుత్వం ఆ పురస్కారాన్ని ఇవ్వలేదు కదా?. ఆయన అభిమానులేమో అల్లు అర్జున్‌నే అన్నాడు అని అనుకుంటున్నారు. ఇప్పుడు ఈ వివాదానికి శుభంకార్డు పడాలంటే 'ఇది నేను జనరల్‌గా అన్నాను' అని పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేయాలి. లేదంటే ఆయన భాగస్వామిగా ఉన్న ఎన్డీయే ప్రభుత్వాన్ని తప్పు పట్టినట్లే. భారత ప్రభుత్వ నిర్ణయాన్ని వివాదాస్పదం చేస్తున్నట్లుగానే భావించాలి. చిరంజీవి గారు పవన్ కల్యాణ్, అల్లు అర్జున్‌తో మాట్లాడి ఈ వివాదానికి ముగింపు పలకాలి.



బ్రదర్.. తప్పకరావాలి!

కమర్షియల్ తెలుగు సినిమాకు ఒక ఊపుని తెచ్చి, బాక్సాఫీసు దగ్గర సునామీ సృష్టించిన హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ. వయసుతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తూ కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తూ దూసుకుపోతున్నారు. ఎన్నోసార్లు బాక్సాఫీసు దగ్గర వీరిరువురి చిత్రాలూ పోటీ పడినప్పటికీ ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా, ఒకరి మీద మరొకరు ప్రత్యేక అభిమానం కురిపిస్తూ మంచి స్నేహితులుగా మెలుగుతుంటారు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే భేదం ఈ ఇద్దరి హీరోలలోనూ లేదు. వృత్తిపరమైన పోటీని సినిమాలకే పరిమితం చేసి నిజజీవితంలో ఎంతో ఎమోషనల్ బాండింగ్ కలిగి ఉంటారు చిరంజీవి, బాలకృష్ణ. గురువారం రాత్రి జరిగిన గీత రచయిత రామజోగయ్యశాస్త్రి ఇంట జరిగిన వివాహ వేడుకలో ఈ అనుబంధం మరోసారి ఆవిష్కృతమైంది. ఈ వేడుకకు చిరంజీవి, బాలకృష్ణ హాజరయ్యారు. చిరంజీవి ఎదురు పడగానే 'బ్రదర్.. ఎలా ఉన్నారు?' అని ఆప్యాయంగా పలకరించారు బాలకృష్ణ. ఇద్దరూ కాసేపు మాట్లాడుకున్న తర్వాత సెప్టెంబర్ ఒకటిన జరిగే తన సన్మాన కార్యక్రమానికి తప్పకుండా రావాలని చిరంజీవిని ఆహ్వానించారు. వస్తానని చిరంజీవి చెప్పారు. అలాగే 'అన్‌స్టాపబుల్' కార్యక్రమం గురించి కూడా వీరిద్దరి మధ్య సంభాషణ జరిగిందని సమాచారం.

కాలం కలిసొస్తే నడిచొచ్చే సినిమా



నాని హీరోగా నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'సరిపోదా శనివారం' ఈ నెల 29న విడుదల కానుంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నాని మాట్లాడుతూ 'ఈ సినిమా గురించి చాలా చెప్పేశాను. దర్శకుడు వివేక్ ఇందులో శివ తాండవం చూపించాడు. అతని కెరీర్‌కి ఈ సినిమా ఓ మైల్‌స్టోన్. మా కష్టాన్ని చూసి మీరు ఎంజాయ్ చేస్తారని భావిస్తున్నా. కాలం కలసి వస్తే నడిచి వచ్చే సినిమా వస్తుందంటారు. అటువంటి సినిమానే 'సరిపోదా శనివారం' అన్నారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ 'మా దర్శకుల కుటుంబం అంతా ఈ వేడుకకి వచ్చి ఆశీస్సులు అందజేశారు. ఈ సినిమా 29న విడుదల చేయడానికి దర్శకుల టీమ్ కూడా ఓ కారణం. నాని నా మీద ఉంచిన నమ్మకానికి 'సరిపోదా శనివారం' ఇచ్చా' అన్నారు. 'ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది. నాని కథల ఎంపికలో బెస్ట్. కథ నచ్చితే కొత్త దర్శకుడైనా అవకాశం ఇస్తారు. ఆయనతో సినిమా చేస్తే నిర్మాతకు ఏ టెన్షన్ ఉండదు' అన్నారు నిర్మాత దానయ్య. ఒక రకమైన యాక్షన్ ఫిల్మ్‌ను దర్శకుడు వివేక్ విభిన్నంగా మలిచారని ఎస్.జె.సూర్య ప్రశంసించారు.

ఇన్ ప్రోగ్రెస్

టైటిల్ సాంగ్ వచ్చేసింది



బిగ్‌బాస్ ఫేమ్ గౌతమ్‌కృష్ణ హీరోగా నవీన్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సోలో బాయ్'. సతీశ్ కుమార్ నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌గా టైటిల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నవీన్‌కుమార్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. మంచి సబ్జెక్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ మూవీలో చాలా ఆకట్టుకునే అంశాలు ఉన్నాయి" అని చెప్పారు.

మహిళలకు మాత్రమే



నూతన నటీనటులతో తెరకెక్కిన చిత్రం 'ఎంత పనిచేశావ్ చంటి'. ఉదయ్ కుమార్ దర్శకత్వంలో లడ్డే బ్రదర్స్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ నిర్వహించింది. దర్శకుడు నక్కిన త్రినాథరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ 'విభిన్న కథతో 'ఎంత పనిచేశావ్ చంటి' చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ సినిమాను మగవాళ్లు చూడకూడదు. మహిళలు మాత్రమే చూడాలి' అని అన్నారు. శ్రీనివాస్‌ఉలిశెట్టి, దియారాజ్, నిహారిక శాంతిప్రియ జంటగా నటించారు. సంగీతం: పవన్ సినిమాటోగ్రఫీ: సంతోష్.

పెద్ద హిట్టవ్వాలి



లక్షణమూర్తి రతన, భ్రమరాంబిక తూటిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సీతారామ్ సిత్రాలు'. డి.నాగశశిధర్ రెడ్డి దర్శకత్వంలో పి.పార్థసారధి, డి.నాగేంద్ర రెడ్డి, కృష్ణ చంద్ర విజయబట్టు నిర్మిస్తున్నారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆకాశ్ జగన్నాథ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆకాశ్ మాట్లాడుతూ "ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు.

అందరూ ప్రశంసిస్తున్నారు



ఇటీవలే 'ఆయ్' సినిమాకు ఆకట్టుకునే సంగీతాన్ని అందించారు అజయ్ అరసాడ. ఈ సినిమా ఘన విజయం సాధించడంతో ఆయన మీడియాతో మాట్లాడారు. "నేను 'ఆయ్' చిత్రంలో సంగీతం అందించిన మూడు పాటలు అందరికీ విపరీతంగా నచ్చాయి. పాటలతో పాటు నేపథ్య సంగీతానికి విశేషాదరణ లభిస్తోంది. ఎంతో మంది మంచి సంగీతం ఇచ్చావని ప్రశంసిస్తున్నారు. ఓ సంగీత దర్శకుడిగా అన్ని జోనర్ సినిమాలు చేయాలనుంది. ప్రస్తుతం రెండు చిత్రాలకి సంగీతం అందిస్తున్నాను" అని చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో...



తమిళంలో విడుదలై ఘనవిజయం సాధించిన చిత్రం 'బంపర్'. ఇప్పుడు అదే పేరుతో తెలుగులోనూ రాబోతోంది. వెట్రి, శివాని నారాయణ్ ముఖ్య పాత్రలు పోషించారు. ఎమ్. సెల్వకుమార్ దర్శకత్వం వహించారు. శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సెల్వకుమార్ మాట్లాడుతూ "ఓ లాటరీ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ చిత్రమిది. ఇందులో వినోదంతో పాటు బోలెడు థ్రిల్లింగ్ అంశాలు ఉంటాయి" అని చెప్పారు.

సోషల్ మీడియా టు సినిమా

ఒకప్పుడు సినిమాల్లోకి రావాలంటే చాలా తతంగం ఉండేది. ఫొటోల ఆల్బమ్ చేత్తో పట్టుకుని ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేది. ఫొటోలు నచ్చితే ఆడిషన్స్‌కు పిలుపు వచ్చేది. ఆడిషన్స్‌లో ఓకే అనిపించుకున్నా అవకాశం వస్తుందో రాదో తెలియని పరిస్థితి.. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది. ఆర్టిస్టులను ఎంపిక చేసే విధానమూ మారింది. సోషల్‌మీడియాలో కొంత హల్‌చల్ చేస్తే చాలు సినిమాల్లో అవకాశాలు వెదుక్కుంటూ వచ్చేస్తున్నాయి. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లే వేదికగా తమ టాలెంట్ ప్రదర్శించి, సినిమాల్లోకి ఎంట్రీ సంపాదించిన నటీమణులు కొందరున్నారు. వారెవరో ఇప్పుడు చూద్దాం.



యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో డ్యాన్స్ రీల్లతో అదరగొడుతూ లక్షలాది మందిని ఆకర్షించారు ఇమాన్ ఇస్మాయెల్ (ఇమాన్వీ). రీల్స్ చేయడమే కాకుండా ఆమె ఓ షార్ట్ ఫిల్మ్‌లోనూ నటించారు. యూట్యూబ్‌లో దాదాపు రెండు మిలియన్ల సబ్‌స్క్రైబర్లు.. ఇన్‌స్టాలో దాదాపు తొమ్మిది లక్షల ఫాలోవర్లు ఆమెకు ఉన్నారు. దాంతో ఇప్పుడీ ఢిల్లీ భామ ఏకంగా ప్రభాస్ సరసన నటించే లక్కీ ఛాన్స్ పొందింది. తొలి సినిమానే పాన్ ఇండియా ఫిల్మ్ కావడం గ్రేట్ కదా! 1940ల నేపథ్యంలో హిస్టారికల్ డ్రామాగా ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకుడు.

గీతా ఆర్ట్స్‌లో..

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వీడియోలు, రీల్స్ ద్వారా ఫేమస్ అయిన మరో కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్.ఎమ్. ఆమె కూడా నటిగా టాలీవుడ్‌లోనూ.. కోలీవుడ్‌లోనూ అడుగుపెట్టనున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో అల్లు అరవింద్ నిర్మించే ఓ తెలుగు చిత్రంలో.. ఆకాశ్‌భాస్కర్ దర్శకత్వంలో అధర్వ హీరోగా ఓ తమిళ సినిమాలోనూ నటిస్తున్నారు. నిహారిక ఇటీవలే అమెరికన్ యానిమేటెడ్ కామెడీ టెలివిజన్ సిరీస్ 'బిగ్ మౌత్ సీజన్ 7'లో ఓ క్యారెక్టర్‌కు వాయిస్ కూడా అందించడం విశేషం. పలు సామాజిక సమస్యలపై సోషల్ మీడియాలో అవగాహన వీడియోలు చేసే నిహారికకు యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లు.. ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్లు మిలియన్లలో ఉన్నారు.

'బేబీ' కాంబోలో..

సోషల్ మీడియాను తెలివిగా వాడుకుని సినిమాల్లో ఎంట్రీ కార్డ్ దక్కించుకున్న తెలుగమ్మాయి అలేఖ్య హారిక (దేత్తడి హారిక). యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్.. కవర్ సాంగ్స్.. వెబ్ సిరీస్‌లలో నటించి పాపులర్ అయ్యారు. ఆమె ప్రస్తుతం సంతోష్ శోభన్ హీరోగా సాయి రాజేశ్ దర్శకత్వంలో ఎస్.కే.ఎన్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు.

వరుసగా నాలుగో చిత్రం

సోషల్ మీడియాతో వరుస అవకాశాలు తెచ్చుకున్నారు కేరళకు చెందిన అనంతిక సనీల్‌కుమార్. కంటెంట్ క్రియేటర్‌గా ఓ వైపు రాణిస్తూనే.. క్లాసికల్ డ్యాన్సర్‌గా.. కరాటేలో బ్లాక్ బెల్ట్ హోల్డర్‌గా పలు రంగాల్లో పట్టు తెచ్చుకున్నారు. ఇప్పటికే మూడు చిత్రాల్లో నటించారు. 'రాజమండ్రి రోజ్‌మిల్క్' చిత్రంతో తెరంగేట్రం చేసి.. 'మ్యాడ్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె ప్రస్తుతం 'మను' ఫేమ్ ఫణీంద్ర నార్సెట్టి దర్శకత్వం వహిస్తున్న 'ఎనిమిది వసంతాలు' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు.



వీళ్లతో పాటు సోషల్‌మీడియాను కేరాఫ్ అడ్రస్‌గా వాడుకుని ఇప్పటికే ఎంతో మంది తారలు సినిమాల్లో అవకాశాలు పట్టేశారు. వారిలో 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య ఒకరు. షార్ట్ ఫిల్మ్స్.. సినిమాల్లో అతిథి పాత్రల్లో నటించిన ఆమె కెరీర్‌ను 'బేబీ' సినిమా సక్సెస్ ఒక్కసారిగా మార్చేసింది. వైష్ణవిని ఓవర్‌నైట్ స్టార్‌ను చేసి వరుస అవకాశాలు తెచ్చిపెట్టింది. మరో నాయిక రుహాని శర్మ కూడా సోషల్ మీడియా నుంచి వెండితెర ప్రయాణం చేసి 'ఇచ్చట వాహనాలు నిలుపరాదు' 'చి.ల.సౌ. స్రవంతి' చిత్రాలలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మోడల్‌గా ట్రయిల్స్ దశలో ఉన్న సాక్షి వైద్య సోషల్‌మీడియాలో తన ఫొటోల ద్వారా సినిమా అవకాశాలు దొరకబుచ్చుకున్నారు. అలా ఆమె 'ఏజెంట్' చిత్రంలో తళుక్కుమన్నారు. ఆ సినిమా సక్సెస్ కాకపోయినా.. ఈ అమ్మడుకు మాత్రం మరో రెండు క్రేజీ ప్రాజెక్ట్స్ లైన్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ కోవలోకి చెందిన వారే.. 'బీస్ట్' ఫేమ్ అపర్ణా దాస్, 'రొమాంటిక్', 'అంగరంగ వైభవంగా' ఫేమ్ కేతిక శర్మ, 'టాక్సీవాలా' ఫేమ్ ప్రియాంక జవాల్కర్. ఇలా ఎంతో మంది సోషల్ మీడియా స్టార్స్‌కు సినిమా తలుపులు తెరుస్తూనే ఉంది. మరి వీరిలో ఎంత మంది హీరోయిన్లుగా నిలబడతారో వేచి చూడాలి.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు తదితరులు

పట్టణంలో ఆక్రమణల తొలగింపు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 24: పట్టణంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలను మున్సిపల్ అధికారులు కొనసాగిస్తున్నారు. స్థానిక శివాజీచౌక్‌లో శనివారం జామియా మస్జీద్ ముందున్న ఆక్రమణలను, అనుమతులు లేని హోర్డింగ్‌లను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ప్లానింగ్ అధికారి సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పర్యవేక్షణలో రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్న షాపులను తొలగిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఆక్రమణల తొలగింపులో ఎటువంటి పక్షపాత వైఖరి లేకుండా దీర్ఘకాలంగా తిష్టవేసుకొనివున్న ఆక్రమణదారుల షాపులను, ఫ్లెక్సీ, ఫ్రేములు, హోర్డింగులను తొలగిస్తున్నామని తెలిపారు. గతంలో బస్‌షెల్టర్‌ను తొలగించి నిర్మించిన షాపును తొలగించామని, కౌన్సిల్ నిర్ణయం మేరకు బస్‌స్టాప్‌ను తిరిగి నిర్మిస్తామని అన్నారు. పట్టణ సుందరీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. డ్రెయిన్‌లను, మురుగు కాలువను ఆక్రమించి కట్టడాలను నిర్మించరాదని, అలా నిర్మిస్తే తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ఏర్పాటు నిషేధం .. పట్టణంలో ఫ్లెక్సీలు, బ్యానర్‌లును ఏర్పాటు చేయడం నిషేధించామని పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న తెలిపారు. శనివారం పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశలో కమిషనర్ శేషన్న మాట్లాడుతూ.. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జారీచేసిన ఉత్తర్వులు అనుసరించి పట్టణంలోని ముఖ్య ప్రదేశాల్లో, రహదారి డివైడర్ మధ్యన, ప్రభుత్వ భవనాలపైన ఫ్లెక్సీలు, బేనర్‌లు ఏర్పాటు చేయడం నిషేధించినట్లు తెలిపారు. అన్నీ ప్రభుత్వ భవనాలపై ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని, లేదంటే సంబంధిత వ్యక్తులపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ప్రతిష్ఠా ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఈవో, సిబ్బంది

26 నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

తెనాలి అర్బన్, ఆగస్టు 24 : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన వైకుంఠపురం ఆలయంలో ఈనెల 26 ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల బ్రోచర్‌ను శనివారం విడుదల చేశారు. కళాన్యాస పూర్వక శిఖర ప్రతిష్ఠ, మహాసంప్రోక్షణ కార్యక్రమాలు మూడు రోజుల పాటు జరుగుతాయని ఈవో తెలిపారు. 26న భగవత్‌ప్రార్థన, జీవధ్వజము, గర్భాలయము, ఉత్సవ విగ్రహాలకు వాస్తుహోమం, పూర్ణాహుతి నిర్వహించి అన్నదానం చేస్తారు. 27న వారాహిస్వామి ఆలయంలో అష్టకలశ స్నపన, పూజలు జరుపుతారు. భక్తులకు అన్నదానం చేస్తారు. 28న విష్వక్సేన ఆరాధన, శిఖర ప్రతిష్ఠ, జీవకళాన్యాసం, మూర్తిఅవాహన, విశేష పూజలు, సంప్రోక్షణ అనంతరం శాంతి కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేస్తారు. మూడు రోజుల పాటు జరిగే పూజాది కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కంభం సాయిబాబు, సభ్యులు సునీత, సరస్వతి, ప్రసాద్, వెంకటరమణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు

తెనాలి అర్బన్, ఆగస్టు 24 : నాజరుపేటలోని ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు మందిర ప్రతినిధులు తెలిపారు. శనివారం ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సోమవారం ఉదయం 4.30 గంటలకు మంగళ హారతి, గురుపూజ, విశేష అలంకరణ, భాగవత ప్రవచనం, కలశాభిషేకం, ఉట్టి ఉత్సవం, హారతి నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కీర్తనలు, సాహిత్య కార్యక్రమాలు, భజనలు, భోగ నివేదన, మహా హారతి నిర్వహిస్తారు. 27న మధ్యాహ్నం ఇస్కాన్ మందిరంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రతినిధులు తెలిపారు.



కారు డ్రైవర్లతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ భాస్కర్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పొన్నూరుటౌన్, ఆగస్టు24: కార్ల డ్రైవర్లు, యజమానులు, ట్రావెల్స్ నిర్వాహకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అర్బన్ సీఐ పి.భాస్కర్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని కార్‌స్టాండ్ డ్రైవర్లకు అర్బన్ సీఐ పలు సూచనలు చేశారు. కార్ల ఫిట్‌నెస్, లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలన్నారు. పర్మిట్‌లు లేకుండా వాహనాలను నడపరాదని హెచ్చరించారు. కార్ల పార్కింగ్ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, మత్తుపదార్థాల సమాచారం తెలిస్తే తక్షణమే తెలియజేయాలని అర్బన్ సీఐ పి.భాస్కర్ సూచించారు.

నేడు సంగీత విభావరి



మాట్లాడుతున్న సాయి లక్కరాజు

తెనాలి అర్బన్, ఆగస్టు 24 : స్వర్ణాలయ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు సాయిలక్కరాజు తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ పాటల వారధి దాశరధి శత జయంతి పురస్కరించుకుని నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయ ఆవరణలో నిర్వహించే విభావరిలో ప్రముఖ గాయకులు సత్యవర్ధన్, సౌజన్య, గీతాలు ఆలపిస్తారని చెప్పారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని నిజాం ప్రభువులను నిలదీసిన దాశరధి ఎన్నో గేయాలు రచించారని అన్నారు. నిర్మలరావు, రవిమోహన్ పాల్గొన్నారు.



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల దశావతారం వెంకన్న స్వామి దివ్య క్షేత్రంలో శ్రావణమాసం సందర్భంగా శనివారం గుంటూరు వాస్తవ్యులు బాపూజీ , శివమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు దశావతార వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలోని మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణపట్టి సమర్పిం చారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కోగంటి వెంకటేశ్వరరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. **- పెదకాకాని**

కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్

- న్యాయాధికారి పీ.రాజశేఖర్
- సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ
- కక్షిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశం



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జడ్జి పీ. రాజశేఖర్

తెనాలి క్రైం, ఆగస్టు 24: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ ఓ మంచి అవకాశమని, కోర్టు ప్రాంగణంలో సెప్టెంబరు 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారానికి కృషి జరగాలని రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీ.రాజశేఖర్ తెలిపారు. శనివారం కోర్టు ప్రాంగణంలో వేమూరు నియోజకవర్గ పోలీసు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పరిష్కరించగలిగే కేసుల్లో కక్షిదారులతో సమావేశం ఏర్పాటు చేసి, వారు లోక్ అదాలత్‌కు హాజరయ్యేలా చూడాలని, కేసులు సామరస్యంగా పరిష్కారానికి దోహదపడే విధంగా కృషి జరగాలని పోలీసుకు సూచించారు. అనంతరం న్యాయవాదులతో జరిగిన సమావేశంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ షరీఫ్‌లు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ పడినట్లయితే కోర్టు ఫీజులు వాపస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకున్నట్లయితే, ఇరువురు విజయం సాధించినట్లేనని అదే కోర్టు ద్వారా సమయం, దనాన్ని నష్టపోవాల్సి వస్తుందని ఇది కక్షి దారులకు వివరించి అధిక కేసులు పరిష్కరించే విధంగా న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



వైకుంఠపుర ఆలయ సమీపంలో కాలువలో నిలిచిపోయిన వ్యర్థాలు

కాలువలో వ్యర్థాలు తొలగించండి

తెనాలి రూరల్, ఆగస్టు 24: తెనాలి వైకుంఠపురం ఆలయ సమీపంలోని కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నాయి. ఈ కాలువలో తెనాలి మార్కెట్ ప్రాంతంలోని చాపలు, ఇతర మాంసపుషాపుల నిర్వాహకులు వేసే వ్యర్థాలతో పాటు ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్, జంతు కళేబరాలను పలువురు ఈ కాలువలోనే వేస్తూ ఉంటారు. కాలువలో నీటి ప్రవాహానికి అవి కొట్టుకు వచ్చి వైకుంఠపురం సమీపంలో వంతెన కింది భాగంలో నిలిచిపోయాయి. ఆ వ్యర్థాల వాసనతో స్థానికులు ముక్కుమూసుకునే పరిస్థితి నెలకొంటుంది. సంబంధిత శాఖ అధికారులు ఆ ప్రాంతంలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

పొన్నూరుటౌన్, ఆగస్టు 24: బూత్ లెవల్ అధికారులు ఓటర్ల జాబితా రూపకల్పనలో అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఫణికుమార్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను వివరించారు. అక్టోబరు 29న ముసాయిదా జాబితా ప్రదర్శించనునట్లు తెలిపారు. నవంబరు 28వ తేదీ లోగా వచ్చిన సమస్యలు పరిష్కరించి, జనవరి 6న తుది ఓటర్ల జాబితా ప్రదర్శించనునట్లు తెలిపారు. సమావేశంలలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యాంగురాలుకి ట్రై సైకిల్ అందచేస్తున్న రోటరీ క్లబ్ నిర్వాహకులు

దివ్యాంగురాలికి ట్రై సైకిల్ అందజేత

పొన్నూరుటౌన్, ఆగస్టు24: పట్టణంలోని నిడుబ్రోలుకు చెందిన దివ్యాంగురాలకి రోటరీ క్లబ్ నిర్వాహకులు ట్రైసైకిల్ అందజేశారు. పట్టణంలోని ఈగల్ ఫ్యామిలీ రెస్టారెంట్ సహకారంతో నిడుబ్రోలు క్యాబిన్ పేటకు చెందిన నాంచారమ్మ అనే దివ్యాంగురాలికి రూ.8 వేల విలువ కలిగిన ట్రై సైకిల్‌ను అందజేసినట్లు రోటరీ క్లబ్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వట్టికూటి ఫణికుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రవిరాకేష్, నన్నపనేని బాలకృష్ణ, శివ రామకృష్ణ, రాధాకృష్ణ, శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థను కొనసాగించాలి

పొన్నూరుటౌన్, ఆగస్టు 24 : వార్డు, గ్రామ సచివాలయ వ్యవస్థను కొనసాగించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జక్క రవీంద్రనాథ్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఐదేళ్లుగా పని చేసిన సచివాలయ వ్యవస్థను కొనిసాగించటంతో పాటు విశిష్ట సేవలలు అందించిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు రూ. 10 వేల వేతనం అందించాలని కోరారు.

27 నుంచి పాఠశాల విద్యార్థులకు

సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు

గుంటూరు(విద్య),ఆగస్టు 24 : ఈనెల 27 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.శైలజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశ్నా పత్రాలు కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా అందజేస్తామని తెలిపారు. విద్యార్థు లకు 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఓఎంఆర్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. జిల్లాలోని సీబీఎస్ఈ పాఠశాలలకు కూడా ప్రశ్నాపత్రాలు సరఫరా చేస్తామని తెలిపారు. అన్ని పాఠశాలలకు మండల విద్యావనరుల కేంద్రం నుంచి ప్రశ్నా పత్రాలు పంపుతామని ప్రతిరోజు గంట ముందుగా మాత్రమే మండల స్థాయిలో కమిటీలు పశ్నాపత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. ప్రశ్నా పత్రాలు బహిర్గతం(లీక్) అయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్త్రీ స్థితిగతులపై నాటక ప్రదర్శన

పెదకాకాని, ఆగస్టు 24: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎస్పీ బాలసుబ్రమణ్యం స్కూల్ ఆఫ్ పర్ఫార్మింగ్ అండ్ ఫైన్ ఆర్ట్స్‌లో థియేటర్ ఆర్ట్స్ విద్యార్థి కళాకారులచేత ప్రముఖ సినీ, రంగస్థలం రచయిత డాక్టర్ తనికెళ్ల భరణి ఆధునిక వీధి నాటిక గోగ్రహణం శనివారం ప్రదర్శించారు. సమాజంలో స్త్రీ ఎదుర్కొంటున్న స్థితిగతులను, సమస్యలను "గోగ్రహణం" నాటికలో కళ్లకు కట్టినట్టుగా చూపించారు. ఈ ప్రదర్శనను విశ్వవిద్యాలయ ఇంఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సింహాచలం తిలకించి శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రదర్శనలతో తోటి విద్యార్థులలో ఆలోచనల్లో మార్పు వచ్చేటట్టుగా ఉండాలని సూచించారు. వీధి నాటికకు దర్శకత్వం వహించి నిర్వహించిన శాఖాధిపతి డాక్టర్ ఎల్వీ నాగభూషణరావు మాట్లాడుతూ యువతి, యువకులు ఈ థియేటర్స్ డిపార్ట్‌మెంట్‌లో తీసుకున్న రెండేళ్ల ఎంపీఏ శిక్షణతో వారి జీవితాన్ని ఉన్నత శిఖరాల వైపు నడుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ సీఐగా రవికిరణ్



అర్బన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన రవికిరణ్

పొన్నూరుటౌన్, ఆగస్టు24 : పొన్నూరు అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కే.రవి కిరణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. రవి కిరణ్ గుంటూరు రేంజ్ వీఆర్ నుంచి బదిలీపై పొన్నూరు వచ్చారు. ఇప్పటివరకు పొన్నూరులో పనిచేస్తున్న సీఐ పీ.భాస్కర్ గుంటూరు వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన రవి కిరణ్‌ను సహచర అధికారులు, సిబ్బంది అభినందించారు.

ఎన్‌వీ నరసింహారావు మృతికి పలువురి సంతాపం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 28: సీనియర్ కమ్యూనిస్టు ఉద్యమ నేత, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నాయకుడు ఎన్‌వీ నరసింహారావు మృతికి పలువురు సంతాపాన్ని తెలిపారు. స్థానిక కొరిటెపాడులోని ఆయన నివాసంలో ఆయన భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవర ప్రసాదు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్, పౌరహక్కుల సంఘ నేతలు చిలకా చంద్రశేఖర్, కోటా మాల్యాద్రి, కె.నళినీకాంత్, బి.ముత్యాలరావు, విరసం నేత సీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

కాంగ్రెస్ వైఖరితో దేశ సమగ్రతకు ప్రమాదం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24: జమ్ము కాశ్మీర్‌లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫ రెన్స్ మధ్య పొత్తు అప్రజాస్వామికమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ అన్నారు. ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశ సమగ్రతకు భంగం కల్గించేలా కాంగ్రెస్ రాజకీయం చేస్తుంద ని విమర్శించారు. అధికారం కోసమే మతతత్వ పార్టీతో పొత్తు కుదుర్చుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 370 ఆర్టికల్ తిరిగి తీసుకొస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ మాటలపై రాహుల్‌గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాహుల్‌గాంధీ పొత్తుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24: సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 28న జరిగే భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగంభవన్‌లో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో భూ బాధితులు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉన్నారని, వారి సమస్యలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 1నుంచి 6వ తేదీ వరకు అధిక ధరలకు నిరసనగా ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతలు కోట మాల్యాద్రి, మేడా హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, బందెల నాసర్‌జీ, షేక్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొల్లిపర, ఆగస్టు 24 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ఇ ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. శనివారం రాత్రి కృష్ణానది సమీపంలో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించగా బాపట్ల జిల్లా పెసరలంకకు చెందిన ఆరు ఇసుక ట్రాక్టర్లును కొల్లిపర మండలం చింతల చెరువు వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు.

కోలాహలంగా కృష్ణాష్టమి వేడుకలు

- శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ చిన్నారులతో కౌన్సిలర్ అరుణ, అంగన్‌వాడీ టీచర్లు

తెనాలి అర్బన్, ఆగస్టు24: పట్టణంలోని బోసురోడ్డులోగల నెహ్రూ నికేతన్ పాఠశాలలో శనివారం కృష్ణాష్టమ వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. పాఠశాల ఎండీ మురళీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులలో సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. కృష్ణుడు, గోపికల వేషదారణలో చిన్నారులు నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమాలను పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

చేబ్రోలు : చేబ్రోలు ప్రెసిడెన్సీ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో వచ్చే అష్టమి పర్వదినాన కృష్ణాష్టమిగా జరుపుకోవటం అనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణుడి వేషదారణలో, గోపిక వేషదారణలో అలరించారు. విద్యార్థులకు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వాసిరెడ్డి బన్‌బాబు, ప్రిన్సిపాల్ వాసిరెడ్డి ఆశ లత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి రూరల్: పట్టణంలోని 27వ వార్డు పాండురంగపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషదారణలో ముస్తాబుచేసి కనువిందు చేశారు. ఆ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ పాల్గొని సంస్కృతి సాంప్రదాయలను చిన్నారులకు చిన్నతనం నుండే అలవరచేలా అంగన్‌వాడీ టీచర్లు చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ చంద్రకళ, పద్మావతి, చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తదితరులు

సుప్రీంకోర్టు న్యాయమూర్తికి అధికారుల స్వాగతం

గుంటూరు, ఆగస్టు 24 : సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ శనివారం గుంటూరు నగరానికి విచ్చేయగా ఆయనకు జిల్లాకోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్ బీజీ పార్థసారథి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ పవార్‌స్వప్నిల్ జగన్నాథ్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులు పుష్ప గుచ్ఛాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ శ్రీనరసింహ, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్‌లు జిల్లాకోర్టు ఆవరణలో మొక్కలను నాటారు.



పూలే, బీపీ మండల్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న వర్సిటీ అధికారులు

బీసీల రిజర్వేషన్ల సాధనకు బీపీ మండల్ కృషి

- జయంతి వేడుకలో ఆచార్య ఎం.త్రిమూర్తిరావు

పెదకాకాని, ఆగస్టు 24 : బీసీల రిజర్వేషన్ల సాధనకు బీపీ మండల్ నిరంతరం కృషి చేశారని వర్సిటీ మహాత్మ జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్ర సంచాలకులు ఆచార్య ఎం.త్రిమూర్తిరావు తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం బీపీ మండల్ 106 జయంతి కార్యక్రమాన్ని ఘనంగా శనివారం నిర్వహించారు. ఈసమావేశానికి అధ్యక్షత వహించిన ఆచార్య ఎం.త్రిమూర్తిరావు మాట్లాడుతూ దేశంలో ఓబీసీ రిజర్వేషన్లు కోసం బీపీ మండల్ అహర్నిశలు కృషి చేసారన్నారు. ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కే.రత్నషీలామణి మాట్లాడుతూ బీపీ మండల్ బీసీల అభ్యున్నతి కోసం ఎంతగానో పాటుపడ్డారని, రిజర్వేషన్లలో 27 శాతం బీసీలకు దక్కేలా చేసిన ఘనత ఆయనకే చెందుతుందని అన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య. సి.హెచ్.స్వరూపారాణి మాట్లాడుతూ నేడు బీసీలు రిజర్వేషన్ల ఫలాలు పొందుతున్నారంటే ఆ గొప్పతనం బీపీ మండల్‌కే చెందుతుందని అన్నారు. ఈ సమావేశానికి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య. వీ. వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి కో ఆర్డినేటర్ డాక్టర్. దివ్యతేజోమూర్తి, యూజీసీ ఇన్‌చార్జి కో ఆర్డినేటర్ ఆచార్య. అశోక్ కుమార్, జగ్జీవన్‌రామ్ ఛైర్ ఇన్‌చార్జి సంచాలకులు ఆచార్య రత్నాకర్, డాక్టర్ సూర్య కామేశ్వరి, డీఈలు వెంకటేశ్వరావు, సుబ్బారావు, నాన్ టీచింగ్ బీసీ ఉద్యోగ సంఘ నాయకులు సాంబశివరావు, సాయిరాం, ప్రసాద్, శ్రీనివాస్, డిల్లేశ్వరరావు, కేవీ సుబ్బారావు, టీ.ఎన్.ఎస్.ఎఫ్ అధ్యక్షుడు నితీష్‌యాదవ్, మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ కోటి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నైపుణ్య శిక్షణ

తెనాలి అర్బన్, ఆగస్టు 24 : ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నైపుణ్య శిక్షణపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో నన్నపనేని భాస్కర్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలు అందుకునేందుకు నైపుణ్యాలకు పదును పెట్టుకోవాలన్నారు. ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడటం, అవగాహన చేసుకోవడం, సబ్జెక్టుపై పట్టు, కోడింగ్‌లో నైపుణ్యం, బృంద పర్యవేక్షణ అవసరమన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, రవీంద్రనాథ్, అజయ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరం

తెనాలి రూరల్, ఆగస్టు 24: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరమని రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రధాన రహదారుల వెంట సిబ్బందితో తనిఖీ నిర్వహించారు. రోడ్ల వెంబడి పబ్లిక్ సంచరించే ప్రాంతాల్లో గుంపులుగా చేరి మద్యం తాగుతున్న పలువురుని అదుపులోకి తీసుకుని వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. చట్టాన్ని ఎవరూ అతిక్రమించరాదనీ, తాము చేసిన సూచనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రూరల్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మున్నంగిలో మెడికల్‌క్యాంపు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

విష జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

- మండల వైద్యాధికారి లక్ష్మీసుధ
- మున్నంగి గ్రామంలో కొనసాగుతున్న వైద్యశిబిరం

కొల్లిపర, ఆగస్టు 24 : విషజ్వరాలు పట్ల తగిన జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి లక్ష్మీసుధ అన్నారు. మండల పరిధిలోని మున్నంగిలో విష జ్వరాలు విజృంభించటంతో వైద్యాధికారులు గత నాలుగు నుంచి వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీసుధ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచిచల్లార్చిన నీటిని త్రాగటం మంచిదన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం వలన మన ఆరోగ్యానికి భద్రత కలుగుతుందన్నారు. గ్రామస్తులు మంచినీటి పొంపుల వద్ద మురుగునీరు నిల్వఉండకుండా చూచుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండటం వలన అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వేముల ప్రియాంక, పీహెచ్ఎన్ సుమతి, హెల్త్ అసిస్టెంట్ గంగవరపు శ్రీనవాసరావు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

భవన సముదాయానికి రూ.6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24 : జేకేసీ రోడ్డులోని కమ్మ జనసేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో ఒక గది నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం రూ.6 లక్షల విరాళాన్ని ప్రభుత్వ మహిళా కళాశాల విశ్రాంత అధ్యాపకులు మేకా లక్ష్మీ తులసమ్మ ప్రకటించారు. కుందులరోడ్డులోని కమ్మజన సేవాసమితి బాలికల వసతి గృహంలో శనివారం చెక్కును సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మేకా లక్ష్మీతులసమ్మ మాట్లాడుతూ పారదర్శకత, విద్యార్థినులకు రక్షణ, పరిశుభ్రమైన భోజనం అందిస్తున్న కమ్మ జన సేవ సమితి సేవలు అభినందనీయమని అన్నారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ నూతన భవన నిర్మాణం మొదలైందని, త్వరలోనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. దాతలు ఇచ్చిన నిధులను సద్వినియోగం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సుంకర రామ్‌మోహన్, ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకుడు చెన్నుపాటి ప్రకాష్, సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, కోశాధికారి గోరంట్ల పున్నయ్య చౌదరి, సభ్యులు గుంటుపల్లి కోటేశ్వరరావు, మద్రిపూడి సీతారామయ్య, ఘంటా పున్నారావు పాల్గొన్నారు.